సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
గురువారం, 21.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 209
పేజీలు: 08 వెల: రూ. 5


## అప్రమత్తంగా ఉండండి

### ఎండలపై సీఎం అలర్ట్

- వడగాలులపై అప్రమత్తం
- ఉత్తర తెలంగాణకు హెచ్చరిక
- ఓఆర్ఎస్ సిద్ధంగా ఉంచండి
- మధ్యాహ్న ప్రయాణాలు వద్దు
- కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

03



## నేటి నుంచి సరస్వతీ

# అంత్య పుష్కరాలు

### కాళేశ్వరంలో నేడు ప్రారంభం



- తొలి పుష్కర స్నానం చేయనున్న కంచి స్వామీజీ
- 12 రోజుల పుష్కరాలకు భారీ ఏర్పాట్లు
- 40 లక్షల మంది భక్తుల రాక అంచనా
- 90 షటిల్ బస్సులు.. 23 పార్కింగ్ జోన్లు
- ఘాట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- వైద్య శిబిరాలు, హారతులు, భక్తి కార్యక్రమాలు

**ముద్ర, మహాదేవపూర్:** పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాలు నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తు న పురాణ కాలక్షేపాలు, ప్రవచనాలు, భక్తి సాంస్కృతిక కార్యక్రమా మిగతా 02లో

## నా శవంపైనా కాషాయం

# జెండా కప్పాలి

### కేంద్ర మంత్రి బండి సంజయ్

- అదే నా చివరి కోరిక
- ఎక్కడైనా కొడుకును తండ్రి పోలీసులకు అప్పగిస్తాడా?
- ఫాల్తుగాళ్లు నాపై దుష్ప్రచారం చేపిస్తున్నారు
- గడీల పాలనను అంతం చేసింది మేమే
- అందుకే నాపై ఫాల్తు ప్రచారం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తాను కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు వస్తున్న వార్తలను ఫాల్తుగాళ్లు చేస్తున్న ప్రచారాలుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కొట్టిపారేశారు. బీజేపీ అంటే ఏమిటో, బండి సంజయ్ అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలందరికీ, కార్యకర్తలకు బాగా తెలుసునన్నారు. ఉరిశిక్ష పడే ముందు చివరి కోరిక ఏమిటని బీజేపీలో నిబద్ధతతో పనిచేసే ఏ కార్యకర్తను అడిగినా.. చనిపోయాక తన శవంపై కాషాయ జెండా కప్పాలని కోరుకుంటారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిగతా 02లో

## కేంద్రాన్ని అదనపు నిధులు కోరిన భట్టి

### రూ.5 వేల కోట్ల సహాయానికి విజ్ఞప్తి



- ఎఫ్ఆర్.బీఎంమినహాయింపు కోరిన తెలంగాణ
- నిర్మలాతో భట్టి కీలక భేటీ
- విద్యా ప్రాజెక్టులకు కేంద్ర మద్దతుపై విజ్ఞప్తి

02

## ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం
- సీఎం చేతుల మీదుగా రెండో విడత
- పేదల సొంతింటి కలలకు శ్రీకారం

02

## ఈసారి 'హైబ్రిడ్'

# మహానాడు

### 27, 28 తేదీల్లో మంగళగిరిలో ఇంధన పొదుపుతో 'హైబ్రిడ్ మహానాడు'కు టీడీపీ నిర్ణయం



- లోకేష్ నేతృత్వంలో తొలి మహానాడు.. భారీ ఏర్పాట్లు
- 19 తీర్మానాలతో టీడీపీ మహానాడు సిద్ధం
- వర్చువల్ & ఫిజికల్ విధానంలో టీడీపీ మహానాడు

04



# ఇన్వెస్ట్ తెలంగాణ

- భారీ పెట్టుబడులకు ప్లాన్
- ఫ్యూచర్ సిటీలో పలు పరిశ్రమల ఏర్పాటు
- జూన్ 2న భూమి పూజలు
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

## ప్రత్యేక ఏజెన్సీకి సీఎం ఆదేశం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రప్పించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, సేవలు అందేలా వ్యవస్థ రూపొందించాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరు మీద ప్రభుత్వం ఒక సొసైటీని ఏర్పాటు చేయనుండగా, ఆ ఏజెన్సీలో ఐటీ, పరిశ్రమ శాఖలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కాగా, ఎనర్జీ, ఫైనాన్స్ వంటి శాఖల అధికారులు ఇన్వెస్ట్ తెలంగాణలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండనున్నారు. ఈ ఏజెన్సీని ఏర్పాటు చేయడంలో ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఉత్తమ విధానాలను అవలంభించాలన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులతో వచ్చే కంపెనీలకు సంపూర్ణంగా తోడ్పాటునందిస్తూ సహకరించే విధంగా ఇన్వెస్ట్ తెలంగాణ పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ వీసీ అండ్ ఎండీ కె. శశాంక, ఐటీ శాఖ మిగతా 02లో

## రేవంత్ ఫ్యూచర్

# పాలిటిక్స్

- హస్తినపైకి దస్తీ
- ఢిల్లీ కలలు
- కేసీఆర్ విఫలమైన చోటే కొత్త రాజకీయం
- రేవంత్ నెగ్గుకొస్తారా?
- చంద్రబాబు నుంచి రేవంత్ దాకా ఒకటే రాగం
- తాజా వ్యాఖ్యలతో తెలంగాణ టూ ఢిల్లీపై చర్చ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఇటీవల జరిగిన ఓ కాన్‌క్లేవ్ లో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. తన రాజకీయ భవిష్యత్తును ప్రకటించారు. నిజానికి, ఢిల్లీ గద్దెపై కొలువుదీరాలనే కలను వెల్లడించారు. దీంతో రేవంత్ రాజకీయం ఇప్పుడు రాష్ట్రంలోనే కాదు.. పక్క రాష్ట్రాల్లోనే చర్చగా మారింది. గతంలో కేసీఆర్ తరహా పొలిటికల్ ప్లాన్ ను అమలు చేస్తున్నట్లే కనిపించింది. బీఆర్ఎస్ గా మార్చే కొంత కాలం ముందు కేసీఆర్ కూడా ఇదే తరహా ప్రకటనలు చేశాడు. పలు రాష్ట్రాలకు వెళ్లి నేతలను కలిశాడు. కానీ, కేసీఆర్.. జాతీయ రాజకీయాల మోజులో పడి తన సొంత గడ్డపై అధికారాన్ని కోల్పోయారు. ఇప్పుడు మిగతా 02లో



## కోనేరులో పడి చిన్నారుల మృతి

- ఆటలాడుకుంటూ వెళ్లి తిరిగిరాని లోకాలకు..
- జగిత్యాలలో హృదయవిదారక ఘటన
- కొండపూర్ గ్రామంలో విషాద ఛాయలు..
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబాలు

03



## తాటి ముంజల రుచి చూసిన

# చంద్రబాబు



*కుప్పం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు స్థానికులతో మమేకమయ్యారు. ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో తంజమ్మకొట్టాలు వద్ద కాన్వాయ్‌ను ఆపి కల్లుగీత కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా కార్మికులు తాటిముంజలు తీస్తుండగా ఆసక్తిగా గమనించిన సీఎం చంద్రబాబు.. 'ముంజలు తీసి ఇవ్వండి.. రుచి చూస్తాం' అంటూ వారితో సరదాగా మాట్లాడా రు. కార్మికులు అందించిన తాజా తాటిముంజలను సీఎం దంపతులు ఆస్వాదించారు. అనంతరం అక్కడి కల్లుగీత కార్మికులతో ముఖ్యమంత్రి కాసేపు ఆత్మీయంగా సంభాషించారు.*

-ముద్ర, హైదరాబాద్ :

## హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్‌కు


# కేంద్రం గ్రీన్ సిగ్నల్



- సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్
- ఖట్టర్ తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ

04

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 21.05.2026
www.mudranews.in | @mudranews



## వేసవిలో మాంసాహారం తగ్గించండి



ఎండాకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది, కాబట్టి మాంసాహారాన్ని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. ఎక్కువగా తినడం వల్ల శరీరంలో వేడి పెరిగి, అసౌకర్యంగా అనిపిస్తుంది.

# ఇన్వెస్ట్ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు టీ–ఫైబర్ ఇంటర్నెట్ వినియోగంలోకి రావాలని స్పష్టం చేశారు. ఇప్పటికే టీ–ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.54 కోట్ల ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహా నగరానికే కే కాదని, జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. హైదరాబాద్ అవతల కూడా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటు చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. “బియాండ్ క్యూర్" (కోర్ అర్బన్ రీజియన్) ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణ పెద్దగా లేని చోట్ల కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ (బీఎఫ్‌సీ)లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో పాటు పర్యావరణ హిత నెట్–జీరో విధానాలు అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

ఈ సందర్భంగా ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని అధికారులను చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకటి ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీ లో ఏర్పాటుకై కేంద్రంతో చర్చలు జరపాలని ఆదేశించారు. అవసరమైతే గౌరవ ప్రధాన మంత్రితో మాట్లాడుతానన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించే విధంగా, ప్రపంచంలోనే గొప్ప ఏఐ సదుపాయాలుండేలా చూడాలన్నారు. ఫ్యూచర్ సిటీ పారిశ్రామిక వాడలో వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రాంగణాల్లో త్వరలో భూమి పూజ చేసేట్టు, అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఫ్యూచర్ సిటీలో స్థాపించే కంపెనీలన్నీ నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలన్నారు. నెట్ జీరో సిటీ తరహా లోనే డిజైన్స్ ఉండాలని, మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని, ఇందులో రాజీ పడొద్దని, దీనికోసం అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని, అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని, ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు,సివిల్ సర్వీస్ అధికారులు,జర్నలిస్ట్ లకు 500 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించరా. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్య లు తీసుకోవాలని, అవసరం అయితే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్ లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలని, భూకేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# నా శవంపైనా కాషాయం జెండా కప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

నా చివరి కోరిక అదేనంటూ ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. తాము అంతర్గత శిక్షణా శిబిరాల ద్వారా ఎంతో మంది కార్యకర్తలను తయారు చేశామని, ఇలాంటి చౌకబారు ప్రచారాలకు స్పందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బుధవారం వచ్చిన బండి సంజయ్‌కు కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, ఎన్వీ సుభాష్‌లతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొందరు పనిగట్టుకుని తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తాను కొత్త పార్టీ పెట్టడం లేదని తేల్చి చెప్పారు. బీజేపీలో ఉండే ప్రతీ ఒక్క కార్యకర్త సుశిక్షితులై ఉంటారని తేల్చి చెప్పారు. తాను నిఖార్సైన బీజేపీ వాదిని అని.. తాను ఎందుకు కొత్త పార్టీ పెడతానని ప్రశ్నించారు. అంతేకాకుండా తాను ఎలాంటి వాడిని అనేది.. బీజేపీ కార్యకర్తలకు అందరికీ తెలుసని పేర్కొన్నారు.

**కుటుంబ పాలనను అంతం చేసింది మేమే**


ఇక తన కుమారుడి కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి వర్గం నుంచి తనను బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారని అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. లోక్‌సభలో కేసీఆర్ పార్టీకి ఒక్క ఎంపీ కూడా లేరని, ఆయన ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఏది వస్తే అది మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ గడీల పాలనను, ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది తామేనని, కల్వకుంట్ల కుటుంబ పాలనను తెలంగాణలో అంతం చేసింది తామేనని, అందుకే తమపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**ఇదే మా చరిత్ర**

కన్న కొడుకును ఒక తండ్రి నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఒక్కటైనా ఉందా.. ఆరోపణలు రావడంతో నిజాయితీగా బండి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించానున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలుకొట్టి, వారి అవినీతి అరాచకాలను బొందపెట్టినందుకే వారు తనపై కక్షగట్టారని బండి సంజయ్ ఆరోపించారు. ఇక తన కుమారుడు బండి భగీరథ్ వివాదంలో అధికారాన్ని అడ్డు పెట్టుకున్నారనే ఆరోపణలను ఆయన పూర్తిగా తిరస్కరించారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఏ తండ్రైనా కన్న కొడుకును నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. పోలీసులు విచారణ కోరగానే తానే స్వయంగా తన కొడుకును విచారణకు పంపానని స్పష్టం చేశారు. తాము ప్రజల్లో ఉంటూ, ప్రజాదరణ పొందుతున్న విషయాన్ని తట్టుకోలేకే.. కేటీఆర్ తన 'ఫేక్ మీడియా ఫ్యాక్టరీ' ద్వారా సోషల్ మీడియాలో ఇలాంటి విషప్రచారం చేయిస్తున్నారని, ఈ ఫేక్ వార్తలను చూసి జనం నవ్వుకుంటున్నారని బండి సంజయ్ విమర్శించారు.

**బీఆర్ఎస్‌కు 17 మంది ఎంపీలు.. కేసీఆర్, కేటీఆర్‌లపై సెటైర్లు**

కేంద్ర మంత్రివర్గం నుండి తనను బర్తరఫ్ చేయబోతున్నారి జరుగుతున్న ప్రచారంపై ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై బండి సంజయ్ ఘాటుగా సెటైర్లు వేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌కు 17 మంది ఎంపీలు ఉన్నట్లు, వారి మద్దతుతోనే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం నడుస్తున్నట్లు కొందరు మాట్లాడుతున్నారు. నన్ను మంత్రి పదవి నుంచి తీసేయాలనే నిర్ణయం బహుశా కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్ తీసుకున్నట్టున్నారు. ఇంకా ముందు ముందు వాళ్లు ఏం చేయబోతున్నారో వాళ్లనే అడగాలి" అంటూ ఎద్దేవా చేశారు. కేటీఆర్ విసిరే చిల్లర మెతుకులకు ఆశపడి ఒకటి కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా అకౌంట్లు ఇలాంటి తప్పుడు కథనాలను వండివారుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వార్తలను చూసి కేసీఆర్ కొడుకు రాక్షసానందం పొందుతున్నాడన్నారు.



# ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ పండుగ'

**ముద్ర, ఆసిఫాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో. రాష్ట్ర, రెవెన్యూ, హౌసింగ్, సమాచార – పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.

బుధవారం రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,, శాసనమండలి సభ్యులు దండె విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి మంత్రి పర్యటించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలను పరిశీలించడంతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు..

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన పొందుతోందన్నారు.

జిల్లాలోని కొఠారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కష్టాలు తొలగిస్తున్నామని తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా మహిళను కుటుంబానికి ఆధారస్తంభంగా గుర్తిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల రెండో విడతలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2026–28 సంవత్సరాలకు గాను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి అంత్య పుష్కరాలు



(మొదటి పేజీ తరువాయి)

లను నిర్వహించనున్నారు.మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కర స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు జూన్ 1 వరకు 12 రోజులు జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద క్వయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 30.63 కోట్ల నిధులను కేటాయించింది. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు.

**రూ. 1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు**

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవంకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 మరుగుదొడ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి కోసం రెండు ఓహెచ్‌ఆర్సీలను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

**300 మంది వైద్య సిబ్బందితో క్యాంపులు**


కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను వైద్యులు, వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని 300 మందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు అందుబాటులో ఉంచనున్నారు. మహాదేవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు.

**1.70 లక్షల వాహనాల పార్కింగ్ కై ప్రత్యేక ఏర్పాట్లు**

ఈ సారి సరస్వతీ అంత్య పుష్కారాలకు లక్షా 70 వేల వాహనాలు వస్తాయని అంచనా వేసి వీటికి గాను 245 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ఏరియాలతో పాటు ఘాట్స్, దేవాలయం తదితర ప్రాంతాలలో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ 12 రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకుగాను 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. పుష్కర ఘాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

**100 మంది గజ ఈతగాళ్ల నియామకం**

పుష్కర స్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 50 మంది గజ ఈతగాళ్లను నియమించారు. వీటితోపాటు సేఫ్టీ బోట్స్, లైఫ్ రింగ్స్, ఎస్డీఆర్ఎఫ్ టీంలను నియమించారు. పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు ఈఓ కార్యాలయంలో మీడియా సెంటర్ చేశారు.



# నిధులు కోరిన భట్టి

**ముద్ర, హైదరాబాద్:**

న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం కలిశారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఎస్ఏఎస్‌సీఐ (SASCI) పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం మంజూరు చేయాలని భట్టి విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యా రంగంలో చేపడుతున్న ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను ఎఫ్.ఆర్.బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని కోరారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, మెడికల్ కాలేజీలు, విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని ఆయన వివరించారు. ఏడీబీ, ఏఐఐబీ సహకారంతో అమలు కానున్న విద్యా ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.

# రేవంత్ ఫ్యూచర్ పాలిటిక్స్

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌అ 2034 లక్ష్యం ఢిల్లీ అని ప్రకటించారు. ఇలాంటి రాజకీయ పరిస్థితుల్లో ఆనాడు కేసీఆర్ విఫలమైన చోట రేవంత్ రాణించగలరా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది.

**ఇక్కడ అధికారం.. అక్కడి కల**

తెలంగాణ రాజకీయాల్లో అధికారం దక్కించుకునే ఏ రాజకీయ నాయకుడైనా చివరకు ఢిల్లీ పీఠం మీదే కన్నేస్తున్నారు. ఇక్కడ.. ఉమ్మడి రాష్ట్రం నుంచి చంద్రబాబు కూడా అదే ప్లాన్. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు కూడా చంద్రబాబు పదేపదే హస్తిన రాజకీయాల గురించే ఎక్కువ మాట్లాడేవారు. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ పాట కూడా అదే. గతంలో కేసీఆర్ తన రెండో విడత పాలన చివరలో బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, చివరికి సొంత ఇలాకాలోనే పట్టు కోల్పోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి తన మొదటి విడత పాలనలోనే.. అది కూడా పదవి చేపట్టిన కొద్ది కాలానికే తన జాతీయ ఆకాంక్షలను బయటపెట్టారు. అయితే కేసీఆర్ ప్రస్థానానికి, రేవంత్ రెడ్డి ఆలోచనలకు మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత కాంగ్రెస్ అనే జాతీయ పార్టీ అండ. కేసీఆర్ శూన్యం నుంచి ఒక జాతీయ వేదికను నిర్మించాల్సి రాగా, రేవంత్ కేవలం ఉన్న పార్టీలోనే తన స్థాయిని పెంచుకుంటే సరిపోతుంది.

**రేవంత్ ముందస్తు అడుగులు**

రేవంత్ తనకు జాతీయ ఆశలు ఉన్నాయని కానీ ఇప్పుడే కాదని చెబుతున్నారు. 2034 లో అని చెబుతున్నారు. కేసీఆర్ తన రెండో పదవీకాలం ముగిసే వేళ జాతీయ రాజకీయాల గురించి గట్టిగా మాట్లాడటం మొదలుపెట్టారు. అప్పటికే పదేళ్ల పాలనపై వ్యతిరేకత మొదలైంది. కానీ రేవంత్ రెడ్డి తన మొదటి టర్మ్‌లోనే తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. ఇది ఒక రకంగా సాహసమే. నేను రెండు సార్లు సీఎంగా ఉంటాను, ఆ తర్వాతే జాతీయ రాజకీయాలకు వెళ్తాను అని చెప్పడం ద్వారా ఆయన తన కేడర్‌లో స్థిరత్వాన్ని నింపాలని చూస్తున్నారు. అయితే, పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజలు ముఖ్యమంత్రి దృష్టి పాలన మీద ఉందా లేక వ్యక్తిగత ఎదుగుదల మీద ఉందా అని ప్రశ్నించే అవకాశం ఉంది.

**రేవంత్‌కు ప్లస్‌లు.. మైనస్సులు**

బీఆర్ఎస్ అనేది కేసీఆర్, ఆయన కుటుంబం చుట్టూ తిరిగే పార్టీ. అక్కడ నిర్ణయాధికారం ఒక్కరిదే. కానీ కాంగ్రెస్ అలా కాదు. ఇక్కడ అంతర్గత ప్రజాస్వామ్యం ఎంత ఉం టుందో, గ్రూపు రాజకీయాలు కూడా అంతే బలంగా ఉంటాయి. రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే బలమైన ప్రత్యర్థులు, సీనియర్లు ఉన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలంటే ఆయన కేవలం ప్రతిపక్షాలనే కాదు, పార్టీలోని ఇతర పవర్ సెంటర్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది. కేసీఆర్‌కు పార్టీలో ఎదురులేకపోవడం ఒక ప్లస్ అయితే, రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం



అతిపెద్ద బలం. కేసీఆర్ తన హయాంలో తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించారు. రేవంత్ రెడ్డి ఇంకా ఆ స్థాయికి చేరుకోవాల్సి ఉంది. పాలనలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయడం, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఆయన రెండో సారి ముఖ్యమంత్రి కాగలరు. ఒకవేళ సంక్షేమ పథకాల్లో విఫలమైతే, 2034 లక్ష్యం అనేది కేవలం కలగానే మిగిలిపోతుంది. తెలంగాణ ప్రజలు ప్రాంతీయ సెంటిమెంట్ కు ప్రాధాన్యత ఇస్తారు. తమ సీఎం ఢిల్లీ పర్యటనలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రజలు భావిస్తే, అది రాజకీయంగా పెద్ద డ్యామేజ్ కలిగిస్తుంది.

**రేవంత్ ఏం చూడాలి..?**

తెలంగాణ ప్రజల తమ కోసం.. తమ నాయకుడు అనుకుంటే.. గెలిచిన నాయకులు మాత్రం మన ఢిల్లీ.. మన దేశం అంటూ బాట పడుతున్నారు. కేసీఆర్ ఎప్పుడైతే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టారో, అప్పుడే తెలంగాణ ఓటర్లు ఆయనకు దూరం కావడం మొదలైంది. రేవంత్ రెడ్డి జాతీయ నాయకుడిగా ఎదగాలంటే, ముందుగా తెలంగాణలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఒకవేళ తె లంగాణ ప్రజలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని భావిస్తే, రెండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే ఉండదు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డికి బలమైన నెట్‌వర్క్, జాతీయ పార్టీ నేపథ్యం ఉన్న మాట వాస్తవమే అయినా.. రాజకీయపరంగా రేవంత్ రెడ్డి ఇంకా హస్తినకు దూరంగానే ఉన్నారు. అనుకున్నట్టే తెలంగాణ రాష్ట్రంలో ప్రజాతీర్పును ఏకపక్షంగా రాబట్టుకుని.. ఆ తర్వాత హస్తినకు పయనమైతే మంచిదనే అభిప్రాయం కూడా వ్యక్తం అవుతోంది.

# కేంద్రాన్ని అదనపు నిధులు కోరిన భట్టి

**ముద్ర, హైదరాబాద్:**

న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం కలిశారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఎస్ఏఎస్‌సీఐ (SASCI) పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం మంజూరు చేయాలని భట్టి విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యా రంగంలో చేపడుతున్న ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను ఎఫ్ఆర్బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని కోరారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, మెడికల్ కాలేజీలు, విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని ఆయన వివరించారు. ఏడీబీ, ఏఐఐబీ సహకారంతో అమలు కానున్న విద్యా ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 21.05.2026
www.mudranews.in | @mudranews



**వేసవిలో మాంసాహారం :**



చికెన్‌కు ప్రాధాన్యత ఇవ్వండి మటన్‌తో పోలిస్తే చికెన్ త్వరగా జీర్ణమవుతుంది మరియు శరీరానికి తక్కువ భారాన్ని కలిగిస్తుంది. మటన్ (రెడ్ మీట్) శరీరంలో వేడిని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది కాబట్టి వేసవిలో దీన్ని వీలైనంత వరకు తగ్గించాలి.

### ఎండ తీవ్రత నేపథ్యంలో
## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సీఎం ఆదేశాలు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ హర్షం

**జనగణనలో కులగణన చేపట్టాలని ఆదేశాలు**
**సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించిన టీపీసీసీ చీఫ్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** జనగణనలో కులగణన చేపట్టాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు తీర్పును టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్వాగతించారు. సామాజిక, ఆర్థిక అసమానతలను సరిచేయడానికి కులగణన అత్యంత అవసరమని చెప్పారు. కులగణన చేయాలని కాంగ్రెస్ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందన్నారు. రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' సందర్భంగా దేశవ్యాప్తంగా కులగణన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. సామాజిక న్యాయ సాధనకు కులగణన కీలకమన్నారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చేపట్టిన కుల సర్వే విజయవంతమైందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.


## ఇ.ఎస్.ఐ టెండర్ల గడువు పొడిగింపు

**అర్హత కలిగిన అన్ని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలకు అవకాశం**

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఇ.ఎస్.ఐ డిస్పెన్సరీలలో అవుట్ సోర్సింగ్ సేవల కోసం జారీ చేసిన టెండర్ల దరఖాస్తుల స్వీకరణ గడువును జూన్ 10 వరకు పొడిగించినట్లు జాయింట్ డైరెక్టర్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) కార్యాలయం వెల్లడించింది. జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అవుట్ సోర్సింగ్ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. గతంలో టెండర్ దరఖాస్తుల స్వీకరణకు మే 18 వరకు గడువు నిర్ణయించగా, తాజాగా దానిని జూన్ 10 వరకు పొడిగించినట్లు తెలిపింది. టెండర్లను తెరవడానికి సంబంధించిన తేదీని దరఖాస్తుల విక్రయం పూర్తయిన అనంతరం ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ టెండర్ ప్రక్రియలో గతంలో ఎంప్యానెల్ చేసిన ఏజెన్సీలతో పాటు అర్హత కలిగిన అన్ని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. టెండర్ దరఖాస్తు ఫారం కోసం రూ.2 వేల విలువైన డిమాండ్ డ్రాఫ్ట్ ను "జిల్లా కలెక్టర్/చైర్మన్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా" పేరిట తీసుకుని దరఖాస్తుతో పాటు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే ఎంపికైన ఏజెన్సీ సెక్యూరిటీ డిపాజిట్/ఈఎండీ కింద రూ.5 లక్షలను "జిల్లా కలెక్టర్/చైర్మన్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా" పేరిట డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఆసక్తి కలిగిన అర్హత గల ఏజెన్సీలు పొడిగించిన గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించింది. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. రాధిక విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

### శంషాబాద్ ఎయిర్ పోర్టులో
## హైగ్రేడ్ గంజాయి స్వాధీనం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం భారీగా హైగ్రేడ్ గంజాయి పట్టుపడింది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. నిందితులు విమానం దిగిన వెంటనే డీఆర్ఐ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని నిలువరించి లగేజీ తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితులు అత్యంత చాకచక్యంగా వాటర్ బాటిల్స్, స్నాక్ టిన్స్, ఫుడ్ బాక్సుల్లో హైగ్రేడ్ గంజాయిని ప్యాక్ చేసి స్మగ్లింగ్‌కు ప్రయత్నించారు. మొత్తం 8.705 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.05 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన డీఆర్ఐ అధికారులు.. ఇద్దరు నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్, ఇతర సంబంధాలపైనా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, బంగారం వంటి విలువైన వస్తువులు తరలిస్తూ స్మగ్లర్లు భారీగా పట్టుపడుతున్నారు.



# ముగ్గురు చిన్నారులను మింగిన కోనేరు

**జగిత్యాల జిల్లాలో ఘోర విషాదం**





**ముద్ర ప్రతినిధి, జగిత్యాల/ కోరుట్ల :** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండపూర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ముగ్గురు అమాయక చిన్నారులు ప్రమాదవశాత్తు కోనేరులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన మేడిపల్లి మండల పరిధిలోని కొండపూర్ గ్రామంలో ఇవాళ సాయంత్రం చోటుచేసుకుంది. ఒకేసారి ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. కొండపూర్ గ్రామానికి చెందిన మనవిత్ (10), మనస్విని (9), షర్వింద్ (7) అనే ముగ్గురు చిన్నారులు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని కోనేరు సమీపంలోకి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక ముగ్గురూ నీటిలోనే ప్రాణాలు విడిచారు. చిన్నారులు కోనేరులో పడిపోయిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ వెంటనే మేడిపల్లి పోలీసులు హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్నారు. స్థానికుల సాయంతో కోనేరులో గాలించి చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. ముక్కుపచ్చలారని చిన్నారుల శవాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే, ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

## ప్రవాసాంధ్రుల కోసం ఏపీఎన్ఆర్టీ అద్భుత సేవలు

**గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
**తెలంగాణ ఎన్నారై సలహా కమిటీతో ఏపీ మంత్రి కొండపల్లి**



**ముద్ర, అమరావతి :** గల్ఫ్ వలసదారులు మరియు విదేశీ కార్మికుల సంక్షేమం కోసం ఒక సమగ్రమైన ఎన్నారై (NRI) విధానాన్ని రూపొందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి ఎన్నారై సలహా కమిటీ.. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు ఏపీలో పర్యటిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం ఈ బృంద సభ్యులు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో తాడేపల్లిలోని ఏపీఎన్ఆర్‌టీ భవనంలో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే ఇక్కడ ప్రవాసాంధ్రుల కోసం ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ కార్యక్రమాలను మంత్రి కొండపల్లి వారికి వివరించారు. ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎన్ఆర్టీఎస్ సంస్థ ద్వారా అనేక విజయవంతమైన కార్యక్రమాలు చేపడుతోందని.. ఈ క్రమంలోనే ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలనకోసమే వచ్చినట్టు తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ పేర్కొంది. ప్రవాసాంధ్రులకు ఏపీ ప్రభుత్వం అందిస్తోన్న సేవలు, అత్యవసర సహాయక చర్యలు, విదేశాల్లో సురక్షిత ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఓఎంకాప్ (ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) పాత్రను కమిటీ అధ్యయనం చేసింది. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, మోసపూరిత ఏజెంట్లపై తీసుకుంటున్న చట్టపరమైన చర్యల గురించి మంత్రితో పాటు ఏపీఎన్ఆర్టీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ వలసదారుల భద్రత, బీమా సౌకర్యాలు, పునరావాస పథకాలపై ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ పర్యటన తర్వాత తెలంగాణలోని విదేశీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలోనే ఒక సమగ్రమైన ఎన్నారై విధానాన్ని రూపొందించడానికి తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ ప్రభుత్వానికి తుది నివేదికను సమర్పించనుంది. ఈ సమావేశంలో ఏపీఎన్ఆర్టీ ప్రెసిడెంట్ డాక్టర్ వేమూరి రవి, ఏపీఎన్ఆర్టీ సీఈవో కృష్ణమోహన్ తెలంగాణ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా.బి.ఎం.వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకుల భూపతి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### సింగరేణి గ్యాసిఫికేషన్‌కు
## కేంద్రం సహకారం అవసరం

**కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి సమావేశం**
**కొయ్యగూడెం బ్లాక్–III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చ**



**ముద్ర, న్యూఢిల్లీ:** బొగ్గు గ్యాసిఫికేషన్‌కు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం బొగ్గు మంత్రిత్వ శాఖ అందించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డితో ఆయన సమావేశమయ్యారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతా యన్నారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని తెలిపారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్–III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమన్నారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్–IIIను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్–II సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్–III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–II మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ — పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ — ప్రాజెక్ట్స్ శ్రీ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జూరాల కుడి, ఎడమ కాలువలు అధ్వానం

- కాల్వల్లో పారుతున్న నిర్లక్ష్యం
- మురుగు కాలువలను తలపిస్తున్న కుడి కాలువ
- వేసవిలో మరమ్మతులకు అవకాశం




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాలువల్లో పిచ్చిమొక్కలు, చెట్లు మొలిచి, పూడిక పేరుకుపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. వర్షాలకు గండ్లు పడటం, లైనింగ్ చేయక ఏటా మరమ్మతులకు గురవుతున్నాయి. కాలువల నిర్వహణపై సరిగా పట్టించుకోవడం లేదు. ప్రతి యేటా జూరాల ప్రాజెక్టు అధికారులు కుడి, ఎడమ కాల్వల మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేసి పంపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కంటి తుడుపుగా కొన్ని నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రధాన సమస్యలు పెరిగి పెద్దవవుతున్నాయి. దీంతో కాల్వల మనుగడే ప్రశ్నార్థకమైంది. ఈ విషయంలో అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తప్పా మరమ్మతులు చేయించలేమని చెబుతున్నారు. ప్రభుత్వ తీరుపై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కాల్వలను పర్యవేక్షిస్తూ లోటుపాట్లను సరిచేయాల్సిన బాధ్యతను విస్మరిస్తుండంపై వారు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**వేసవిలో మరమ్మతులకు అవకాశం**

వేసవికాలంలో జూరాల ఆయకట్టుకు అధికారులు విరామాన్ని ప్రకటిస్తారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు లేకపోవడంతో రైతులు ఎవరూ పంటలు వేసుకోవద్దని సూచిస్తారు. దీంతో నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తారు. మూడు, నాలుగు నెలల పాటు జూరాలకు సంబంధించి ఏ చిన్న కాల్వలోనూ చుక్క నీరు కనిపించదు. ఈ సమయంలోనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో అది జరగటం లేదు. ప్రమాదకరంగా తయారైన చోట్లను గుర్తించి వాటిని సరి చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం మరిచిపోయింది.

**మురుగు కాలువలను తలపిస్తున్న కుడి కాలువ**


గద్వాల పట్టణంలో ప్రవహిస్తున్న జూరాల ప్రాజెక్టు కుడి కాలువ సరైన నిర్వహణ లేక మురుగు కాలువలను తలపిస్తున్నాయి. జూరాల కుడి కాలువ ద్వారా గద్వాల పట్టణ ప్రజలకు తాగునీరు, గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలోని పంట పొలాలకు సాగు నీరందిస్తున్నారు. జూరాల కుడి కాలువలో ఏళ్ల తరబడి పూడికతీత, మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల కాలువల్లో చెత్తాచెదారం, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోయి నీరు ప్రవహించకుండా అడ్డుపడుతున్నాయి. చెనుగోనిపల్లి రోడ్డు,భీంనగర్, రెవెన్యూ కాలనీ , పాత హౌసింగ్ బోర్డు, బీరొల్లు రోడ్డు, జమ్మిచేడు వరకు గద్వాల పట్టణంలో ప్రవహిస్తున్న జూరాల కుడికాలువలో నిత్యం ప్లాస్టిక్ కవర్లు, చెత్తచెదారం, వ్యర్థపదార్థాలు పారవేయడంతో కుడి కాలువ చెత్తచెదారంతో నిండి పోయింది. జమ్ములమ్మ రిజర్వాయర్ నుంచి గద్వాల పట్టణ ప్రజలకు తాగునీరందించే కుడి కాలువలో భీంనగర్, రెవెన్యూ కాలనీ, పాత హౌసింగ్ బోర్డు కాలనీల నుంచి డ్రెయినేజీ నీళ్లు కుడికాలువలో ప్రవహిస్తున్నట్లు ఆరోపణలు. ఇదే కుడి కాలువ నీరు ఫిల్టర్ చేసి తాగునీరందిస్తున్నారు. అలాగే పలు చోట్ల కుడి కాలువ ధ్వంసం కావడంతో పొలాలకు అందాల్సిన సాగునీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవికాలంలో కాలువలోని చెత్తచెదారాన్ని తొలగించి, కాలువ మరమ్మతులు చేయాలని రైతులు పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్న ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 21.05.2026
www.mudranews.in | @mudranews



**వేసవిలో మాంసాహారం..**
**మసాలాలు, నూనెలు తగ్గించండి**

మాంసం వండేటప్పుడు దట్టమైన మసాలాలు, కారం, నూనెలను భారీగా వాడటం అస్సలు మంచిది కాదు. ఇవి కడుపులో మంట, ఎసిడిటీకి దారితీస్తాయి కాబట్టి కూరను లైట్‌గా, సులభంగా జీర్ణమయ్యేలా వండుకోవాలి.



# అగ్నిగుండం

- రాష్ట్రంలో ఎండలు తీవ్రరూపం
- ఉత్తర, తూర్పు జిల్లాల్లో నిప్పులు కురిపిస్తోన్న సూర్యుడు
- దిలావర్‌పూర్‌లో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత

ముద్ర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. రోహిణి కార్తె ప్రవేశానికి ముందే సూర్య భగవానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల మార్కును దాటడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలు నిప్పుల గుండాల్లా మారాయి. బుధవారం అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదై, ఈ సీజన్‌లోనే అత్యంత వేడి రోజుగా నిలిచింది.



**పెరిగిన వడగాల్పుల తీవ్రత..**

రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. హన్మకొండ, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. జగిత్యాల, జనగాం, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో పాదరసం 46.3 డిగ్రీలకు చేరింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో 46.2 డిగ్రీలు, ములుగు, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 46.1 డిగ్రీలు, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో 46.0 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది.

**రోడ్లపై కర్ఫ్యూ..**

ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండటంతో, మధ్యాహ్నానికి ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. వేడి గాలుల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఈ తీవ్రమైన పరిస్థితుల దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు ఉప్పు, చక్కర కలిపిన ద్రావణం, మజ్జిగ, కొబ్బరినీళ్లు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు మధ్యాహ్నం వేళల్లో ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు.

## జైలు మ్యూజియం సందర్శించిన యాక్ బృందం




**ముద్ర, హైదరాబాద్ :** చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన జైలు మ్యూజియాన్ని, ఫీల్ ద జైలు కేంద్రాన్ని యూత్ పర్ యాంటీ కరప్షన్ బృందం బుధవారం సందర్శించింది. బ్రిటిష్ కాలం, నిజాం కాలం నాటి నుంచి ఉన్న జైలు నమూనాలను, అప్పటి శిక్షలను చాలా అద్భుతంగా అందరికి అర్థమయ్యే రీతిలో పొందబరిచారని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అన్నారు. ఒక రోజు జైలు జీవితం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిమాణమని, జైలులో ఖైదీల ప్రవర్తన, పనితీరు, శిక్షలు, ఆహారం ఎలా ఉంటుందనే అంశాలు పూర్తిగా తెలుస్తాయన్నారు. దీని గురించి తెలుసు కున్న వారికి తప్పు చేయాలనే ఆలోచన రాదన్నారు. చంచల్‌గూడ జైలు సూపరిండెంటెంట్ యువతకు, విద్యార్థులకు దీనిపై మీ సంస్థ నుంచి అవగాహన కల్పించాలని కోరారు. శిక్షలు పడకుండా, నేరం చేయకుండా ఉండేందుకే ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భన బృందంలో కొన్నె దేవేందర్, జి హరిప్రకాశ్, బత్తిని రాజేశ్, కొమటి రమేష్‌బాబు, సాయి కిరణ్, విక్రమ్, రాజామ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ జెండా పండుగకు ఇన్‌ఛార్జీల నియామకం

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చేపట్టనున్న జెండా పండుగ కార్యక్రమాల కోసం పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత రాష్ట్రంలోని 33 జిల్లాలకు స్టేట్, జిల్లా ఇన్‌ఛార్జీలను నియమించారు. అలాగే 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జీలను ప్రకటించారు. నెల రోజుల పాటు నిర్వహించే టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాలను ఈ ఇన్‌ఛార్జీలు పర్యవేక్షించనున్నారు.

4వ పేజీకి

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ సేవలు మానవాళికి దిక్సూచి

**- సీఎం చంద్రబాబు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ రవిశంకర్ బోధనలు ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపిస్తున్నాయని పేర్కొన్నారు. గురూజీ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో మాట్లాడిన సీఎం, తాను కేవలం ముఖ్యమంత్రిగా కాకుండా భారతీయుడిగా, గురూజీ బోధనలను అనుసరించే వ్యక్తిగా హాజరయ్యానని అన్నారు. శ్రీశ్రీ రవిశంకర్ కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాకుండా శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలిచిన ప్రపంచ మానవుడని కొనియాడారు. “హింసలేని సమాజం – ఒత్తిడి లేని మనుషులు” అనే లక్ష్యంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ గత 45 ఏళ్లుగా కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తోందన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ సంభాషణల ద్వారా శాంతి సాధనకు గురూజీ చేసిన కృషి విశేషమని తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఇంధన వనరుల సమస్యలతో ప్రజల జీవితాలు ఒత్తిడికి లోనవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు మానవాళికి మరింత సేవ చేయాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఎదుగుతోందని అన్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, స్పేస్, డ్రోన్, డేటా సెంటర్ ప్రాజెక్టులు, క్వాంటం కంప్యూటర్ వంటి ఆధునిక సాంకేతిక ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి, అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అయితే అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి శాంతి, ఆనందం కలగాలని తాను కోరుకుంటున్నానన్నారు.

“హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ” లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలు చేస్తున్నామని, ప్రతి పౌరుడికి అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో మరింతగా పనిచేయాలని ఆహ్వానించారు.

## అత్తామామలను చంపిన అల్లుడికి ఉరిశిక్ష

ముద్ర, వరంగల్ : అత్తామామలను నరికి చంపిన అల్లుడికి ఉరిశిక్ష విధిస్తూ బుధవారం వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి మైత్రేయి తీర్పు వెలువరించారు. వివరాలివి.. మేకల నాగరాజు అలియాస్ బన్నీ (25) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింత ల్‌తండాకు చెందిన దీపికను 2023 నవంబరులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పుట్టింటికి ళ్లిపోయిన దీపిక తిరిగిరాలేదు.దీంతో అక్కసు పెంచుకున్న నాగరాజు 2024 జులై 10న పదహారుచింతల్‌తండాలో రాత్రివేళ నిద్రిస్తున్న అత్తామామలు సుగు ణ, శ్రీనులను దారుణంగా కత్తితో నరికి హత మార్చాడు. అడ్డుగా వచ్చిన దీపిక, బామ్మరిలపై సైతం కత్తితో దాడి చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేప ట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశా రు. నేరం రుజువు కావడంతో నాగ రాజు కు ఉరిశిక్ష వేశారు న్యాయమూర్తి.

## హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్**

**ఖట్టర్ తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ**



**ముద్ర, న్యూఢిల్లీ :** హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో మరో మైలురాయిగా భావిస్తున్న మెట్రో సెకండ్ ఫేజ్ విషయంలో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రంషట్టర్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం ఢిల్లీ లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న వివిధ కీలక ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. నగరంలో మౌలిక వసతులు, పారిశుధ్యం, ప్రజారవాణాపై చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై చర్చ జరిగిందని మెట్రో సెకండ్ ఫేజ్ కు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని, డీపీఆర్ అందిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఖట్టర్ చెప్పారని కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్రాలు చెరో సగం ఖర్చుతో ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. 162 కి.మీ మెట్రో రెండో దశ విస్తరణకు రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయని వీటిని కేంద్రం పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతుందని ఖట్టర్ చెప్పారు. కాగా తెలంగాణ ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మొదటి దశ మెట్రోను టేకోవర్ చేసిన సంగతి తెలిసిందే.

## దేదీప్యమానంగా కాళేశ్వరం

**రాత్రివేళ కాళే శ్వరం పుణ్యక్షేత్రం అందాలు**









### 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్' పద్ధతిలో

# టీడీపీ మహానాడు

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్ :** మంగళగిరి వేదికగా ఈనెల 27, 28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మక ‘మహానాడు’ కార్యక్రమాన్ని హైబ్రిడ్ (వర్చువల్ & ఫిజికల్) విధానంలో నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 37 మహానాడులు విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసిన సోమిరెడ్డి.. తొలుత ఈసారి మహానాడును నెల్లూరులో భారీ స్థాయిలో నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులు, ఇంధన పొదుపు అవసరం, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు నేపథ్యంలో భారీగా వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో మహానాడును మంగళగిరిలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించినట్లు తెలిపారు.

నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇదేనని, ఆయన నేతృత్వంలో కార్యక్రమం అట్టహాసంగా సాగనుందని చెప్పారు. ఈ వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు, జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని వెల్లడించారు.

కోవిడ్ సమయంలో అమలు చేసిన విధానాన్ని మళ్లీ అనుసరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ల వారీగా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి మండలాన్ని రెండు లేదా మూడు క్లస్టర్లుగా విభజించి, ఒక్కో క్లస్టర్‌లో సుమారు 300 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి మంగళగిరి కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనే 12 క్లస్టర్లు ఏర్పాటు చేసి దాదాపు 4 వేల మందికి భోజన వసతులు కల్పించనున్నట్లు వివరించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో సానుకూల మార్పులు చోటుచేసుకున్నాయని సోమిరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్, నారా లోకేష్ కృషి, కేంద్ర ప్రభుత్వ మద్దతు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు.

అదే సమయంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన సోమిరెడ్డి.. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకునేలా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవాల్సిన బాధ్యత ఉందని, కానీ వైసీపీ మాత్రం విధ్వంసక రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

ఈ మహానాడులో మొత్తం 19 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 13 తీర్మానాలు, తెలంగాణకు సంబంధించిన 4 తీర్మానాలు, అండమాన్ అలయన్స్‌పై ఒక తీర్మానం, రాజకీయ అంశాలపై మరో తీర్మానం ఉంటాయని చెప్పారు. తీర్మానాల కమిటీ సభ్యులు రెండు రోజుల పాటు చర్చించి వీటిని ఖరారు చేశారని, పొలిట్‌బ్యూరో ఆమోదం అనంతరం మహానాడులో అధికారికంగా ప్రవేశపెడతామని సోమిరెడ్డి స్పష్టం చేశారు.


## గ్లోబల్ టెక్ – ట్రావెల్ క్లస్టర్ గా హైదరాబాద్

**భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా దిగ్గజ కంపెనీలను ఆకర్షించేలా ‘ఎకో సిస్టం’ అభివృద్ధి**

**ఇన్నోవేషన్ నెట్ వర్క్ ను బలోపేతం చేసేలా ‘రెడీ టూ వర్క్ ఫోర్స్’ తయారీ**

**‘సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్’ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**గ్లోబల్ టెక్ – ట్రావెల్ క్లస్టర్ గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా... ఈ రంగ దిగ్గజ కంపెనీలను ఆకర్షించేలా ఒక పటిష్ఠమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుధవారం హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎయిర్ లైన్స్ సంస్థ ‘సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్’ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... విమానయానం, స్పేస్–టెక్, డిఫెన్స్, డీప్–టెక్ తదితర రంగాల్లో హైదరాబాద్ ఒక వ్యూహాత్మక కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు. గత రెండేళ్ల వ్యవధిలో వ్యాన్‌గార్డ్, మారియట్ ఇంటర్నేషనల్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, హార్ట్ ఫోర్డ్, బీఏఎస్ఎఫ్ తదితర ఎన్నో దిగ్గజ సంస్థలు హైదరాబాద్ ను తమ గమ్యస్థానంగా ఎంచుకున్నాయన్నారు. తాజాగా ఈ జాబితాలో ‘సౌత్ వెస్ట్ ఎయిర్స్ లైన్స్’ కూడా చేరడం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేలా నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ‘రెడీ టూ వర్క్ ఫోర్స్’ తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఆర్ అండ్ డీ, స్కిల్లింగ్, ఇన్నోవేషన్ తదితర అంశాల్లో దిగ్గజ సంస్థలతో కలిసి పని చేసేందుకు ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. "తాజాగా ప్రారంభమైన ఈ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ‘సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్’కు ఒక స్ట్రాటెజిక్ హబ్ గా పని చేయనుంది. కంపెనీ గ్లోబల్ నెట్ వర్క్, సపోర్టింగ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్ ప్రైజ్ కేపబిలిటీస్ తదితర అంశాల్లో కీలక సేవలు అందించనుంది. డీప్ టెక్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డిజిటల్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్ ప్రైజ్ ప్లాట్ ఫామ్స్ తదితర విభాగాల్లో నిపుణులైన వేయి మందికి ఇక్కడ కొత్తగా ఉపాధి లభించనుంది. విమానయాన రంగంలో హైదరాబాద్ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం కానుంది" అని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ వైస్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లారెన్ వుడ్స్, వైస్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ హెడ్ ఆఫ్ ఇన్నోవేషన్, ఇండియా కృష్ణ కల్లెపల్లి, ఐటీ అడ్వైజర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 21-05-2026
www.mudranews.in | @mudranews



### వేసవిలో మాంసాహారం
**మధ్యాహ్నం పూట మాత్రమే తినండి**

నాన్‌వెజ్‌ను రాత్రి పూట కాకుండా, మధ్యాహ్నం భోజనంలో తినడానికి ప్రయత్నించండి. రాత్రి పూట తింటే జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పట్టి, నిద్ర లేమి, కడుపుబ్బరం వంటి సమస్యలు వస్తాయి.



## మీడియా అక్రెడిటేషన్ కార్డుల అందజేత



**ముద్ర, నారాయణపేట:** జిల్లాలో పని చేస్తున్న గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు 2026–2028 కాల వ్యవధి కోసం మంజూరైన తొలి విడత అక్రెడిటేషన్ కార్డులను జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ ఛైర్మన్, కలెక్టర్ సిహెచ్ ప్రియాంక బుధవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో లాంఛనంగా అందజేశారు. జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, మీడియా జిల్లా ప్రతినిధులు, డీపీఆర్వో కార్యాలయ సిబ్బంది కలెక్టర్ చేతుల మీదుగా కార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ ఎంఏ రషీద్, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు కే నారాయణరెడ్డి, భీం సేన్ రావు, శ్రీధర్ రావు, నరేందర్, రఘుగణప, నక్క శ్రీనివాస్, మధుకర్, సులిగేం సురేష్, మహమ్మద్ తకి, సంజీవ్ ప్రకాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**ముద్ర, కాప్రా:** రామంతాపూర్, కట్‌రెడ్డి నగర్ డివిజన్లలో రూ. 8.36 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. బాక్స్ డ్రైన్లు, బాక్స్ కల్వర్టులు, సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, శ్మశాన వాటిక మరమ్మతులు, వెయిటింగ్ హాల్స్, స్టోర్ రూమ్‌లు తదితర మౌలిక వసతుల పనులు ఇందులో భాగంగా చేపట్టను న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ లో 1,340 కేసులు నమోదు




**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో సెల్‌ఫోన్ మాట్లా డుతూ వాహనాలు నడిపించే వారిపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఒక్కరోజే 1,340 కేసులు నమోదు చేసి రూ.13.39 లక్షల జరిమానా విధించారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు పంపడం, వీడియోలు తీయడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. వాహనదారులు డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## ఇందిరమ్మ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**తాండూరు, ముద్ర ప్రతినిధి:** తాండూరు మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు బుధవారం తెల్లవారు జామున కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శాంతి భద్రతల దృష్ట్యా కాలనీలోని ఇంటింటికి తిరిగి వివరాలను సేకరించారు. ఇంట్లో ఉంటున్న వారి ఆధార్ కార్డులను, ఇళ్లలో ఉన్న వాహనాల పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని బైకులు, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు పరమేశ్వర్ గౌడ్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది, వార్డు కౌన్సిలర్ జావిద్, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల ప్రక్రియపై కలెక్టర్‌తో బీజేపీ నాయకుల భేటీ



**ముద్ర, కాప్రా:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో కొనసాగుతున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియతో పాటు త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్‌కు సంబంధించిన పలు అంశాలపై బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ మను చౌదరిని ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ప్రస్తుతం జరుగుతున్న తీరుతెన్నులు, ప్రజలకు కలిగే ఇబ్బందులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ,బీజేపీ నాయకులు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, బుద్ధి శ్రీనివాస్, ఎం. కాంతారావు, గౌరిగి కృష్ణ, తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం*

**ముద్ర కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కుమారస్వామి ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "సమర్థ్" పథకం ద్వారా యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల దుస్తులను ఆయన పరిశీలించి, వారి నైపుణ్యాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి సర్టిఫికెట్లను అందజేశారు. నిరంతరం సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ ప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ బీజేపీ నాయకులు రఘురాం, వినోద్ గౌడ్, సూరిబాబు, ప్రేమ్, స్థానిక నేతలు, ట్రస్ట్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పాలమూరులో ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**- విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** పాలమూరు పట్టణంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో పోలీస్, మున్సిపల్, రవాణా శాఖల అధికారులతో ఆయన రోడ్డు భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ కోసం రానున్న ఆరు నెలల్లో పట్టణ వ్యాప్తంగా వివిధ నిధులతో 750 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడపకుండా కఠినంగా వ్యవహరించాలని, ఇందుకు తల్లిదండ్రులను సైతం బాధ్యులను చేయాలని పోలీసులను ఆదేశించారు. అలాగే హైవేలు, బైపాస్ రోడ్లపై అతివేగాన్ని అరికట్టేందుకు స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రోడ్డు భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు ఎస్పీ, నగర మేయర్ తదితరులతో కూడిన 'రోడ్ సేఫ్టీ కోఆర్డినేషన్ కమిటీ'ని ఏర్పాటు చేస్తున్నామని, ఇది ప్రతి నెలా సమావేశమై పరిస్థితులను సమీక్షిస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇకపై నిర్ణీత సమయం మించి బార్ షాపులు, హోటళ్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, అలాగే ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అందరి సమన్వయంతో పాలమూరును సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్న ఆయన..

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి, మేయర్ గుమ్మాల మమత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, పోలీస్, మున్సిపల్, ట్రాఫిక్, రోడ్ రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్డెక్కితే సీజ్

**- డీటీఓ బాలు నాయక్**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లాలో విద్యార్థుల భద్రతే లక్ష్యంగా ఫిట్‌నెస్ లేని పాఠశాల బస్సులపై రవాణా శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించిందని నాగర్‌కర్నూల్ డీటీఓ బాలు నాయక్ హెచ్చరించారు. జిల్లాలోని మొత్తం 190 స్కూల్ బస్సులకు గానూ సోమవారం 54 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరయ్యాయని ఆయన తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే యాజమాన్యాలను ఉపేక్షించేది లేదని, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనాలను నడిపితే భారీ జరిమానాలతో పాటు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. బస్సు డ్రైవర్లకు హెవీ లైసెన్స్‌తో పాటు ఐదేళ్ల అనుభవం ఉండాలని, 60 ఏళ్లలోపు వారికే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్లకు ప్రతి నెల బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి మెడికల్ సర్టిఫికేట్ పొందడం, యూనిఫామ్ ధరించడం తప్పనిసరి అని ఆదేశించారు. 15 ఏళ్లు దాటిన బస్సులను స్క్రాప్ చేయాలని, సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, స్కూల్ బస్సులను ప్రైవేట్ పనులకు వాడరాదని హెచ్చరించారు. ప్రతి బస్సు పసుపు రంగు లో ఉంటూ.. ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు, సేఫ్టీ గ్రిల్స్, అనుకూల మైన మెట్లతో పాటు నాలుగు వైపులా పార్కింగ్ లైట్లను కలిగి ఉండాలన్నారు. బస్సుపై పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా ఉండాలని డీటీఓ బాలు నాయక్ పలు సూచనలు చేశారు.

## రేషన్ కార్డుల జారీ వేగవంతం చేయాలి

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**ముద్ర, మల్కాజిగిరి:** ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో కొత్త రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల సుధీర్ బాబు ఇచ్చిన సూచనల మేరకు రేషన్ షాపుల ఏర్పాటు అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన పేదలకు త్వరితగతిన రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా పౌర సరఫరాల సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, రేషన్ డీలర్ సభ్యులు బాల్‌రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- గ్రామీణాభివృద్ధే ప్రధాన లక్ష్యం**

**– కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** గ్రామాల సమగ్రాభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డి పల్లిలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సాగుతున్న అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏటీసీ సెంటర్, ప్రత్యేక మోడల్ స్కూల్ నిర్మాణాలకు అవసరమైన స్థలాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం ఇటీవల ప్రారంభించిన ఆధునిక మిల్క్ సెంటర్‌ను సందర్శించి పాల సేకరణ, టెస్టింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పశువైద్య కేంద్రం, నిర్మాణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను పరిశీలించిన కలెక్టర్.. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సంప్, నీటి శుద్ధి కేంద్రం పనులను పరిశీలిస్తూ పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమం ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ఉండాలని, పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయకుమార్, డీఈఓ రమేష్ కుమార్, డివిజన్, మండల స్థాయి అధికారులు, సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### అమ్రాబాద్ పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా నిర్వాసితుల జీవన ప్రమాణాల మెరుగుదలే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో తొలి విడత పునరావాస ప్రక్రియ, నష్టపరిహారం చెల్లింపులపై అధికారులతో సమీక్షించారు. పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామ పరిధిలో ప్రతిపాదించిన పునరావాస కేంద్రంలో గృహ నిర్మాణ స్థలాలు, రహదారులు, తాగునీరు, విద్యా సంస్థలు, వైద్యం, పరిశుభ్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలను సమగ్రంగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కొత్త ప్రాంతంలో నిర్వాసిత కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నల్లమల అటవీ ప్రాంత నిర్వాసితుల పేర్లపై భూ పట్టాలను వెంటనే జారీ చేయాలని కమిటీ సభ్యులు కోరగా, రాబోయే 30 రోజుల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ, తొలి విడత నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పునరావాస కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ పేర్కొన్న ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఆర్టీవోలు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ఆర్టీవోలు, ఆయా గ్రామాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



**ముద్ర, కూకట్ పల్లి :** కేపీ హెచ్ బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైనట్లు పోలీ సులు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కేపీహెచ్ బీ కాలనీ 4వ ఫేజ్ లో నివాసముండే డ్రైవర్ సిందం విజయ్ కుమార్ కు 2007 లో శ్రీకాకుళానికి చెందిన రేవతి (36) తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, గత కొంతకాలంగా రేవతి అనారోగ్య సమస్యలతో బాధప డుతుండటంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రేవతి ఇంట్లో ఉన్న నగదు, బంగారం, మొబైల్ ఫోన్ తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. సాయంత్రం 6 గంటలకు భర్త విజయ్ కుమార్ ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించ కపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో విజయ్ కుమార్ కేపీహెచ్ బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 'మహిళ అదృశ్యం'గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏఎస్ఐ బి. పురుషోత్తం ఈ కేసును విచారిస్తున్నారు.

## శ్రీపురం రోడ్ ఆర్ట్స్ కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీపురం రోడ్డులో గల ప్రభుత్వ ఆర్ట్స్ & కామర్స్ డిగ్రీ కళాశాల వద్ద లయన్స్ క్లబ్ సహకారంతో టీజీఎస్‌ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను డిపో మేనేజర్ యాదయ్య ప్రారంభించారు. కళాశాలలో 400 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలకు సమీపంలో బస్‌స్టాప్ లేకపోవడంతో విద్యార్థుల సమస్యను గుర్తించిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు టీజీఎస్‌ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు. ఎన్నో ప్రయత్నాల అనంతరం లయన్స్ క్లబ్ గవర్నర్ రాధాకృష్ణ ఆర్థిక సహకారంతో మంగళవారం బస్‌స్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు.

# భరతమాత ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**ముద్ర, శేరిలింగంపల్లి :** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కేవలం కమ్యూనిస్టులకే కాకుండా సమ సమాజ స్థాపనకు మార్గదర్శకుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ కొనియాడారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘనంగా నిర్వహించిన ఆయన 41వ వర్ధంతి కార్యక్రమానికి జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరై, సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయన జీవితం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఆ రోజుల్లోనే కులాంతర వివాహం చేసుకున్నారని, తన యావదాస్తిని ప్రజలకే అప్పగించిన నిరాడంబర జీవి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 'ప్రశ్న' నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, పార్టీ నాయకులు జగదీశ్, శోభన్, కృష్ణ, బషీర్, వెంకటయ్య, అనిల్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.



### వేసవిలో మాంసాహారం : నీళ్లు ఎక్కువగా తాగండి



మాంసంలో ప్రొటీన్లు ఎక్కువ, ఇవి జీర్ణం కావడానికి శరీరానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది.అందువల్ల నాన్‌వెజ్ తిన్న రోజున డీహైడ్రేషన్ బారిన పడకుండా రోజంతా తగినంత నీరు తాగుతూ ఉండాలి.

## జిల్లాకు 5వేల కోట్లను కేటాయించాలి

- **బీఆర్ఎస్ యువ నేత మజర్**

**బోథ్, ముద్ర :**



ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దత్తత జిల్లాగా పేరున్న ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం రూ.ఐదు వేల కోట్ల నిధుల మంజూరు పత్రంతోనే ఆదిలాబాద్ జిల్లాకు రావాలని బీఆర్ఎస్ యువ నేత మజర్ డిమాండ్ చేశారు. బుధవారం నేరడి గోండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. ఆచరణలో అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం సగం మందికే సగం రేటు గ్యాస్ అందిస్తుందని మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.1050 చెల్లించి గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేస్తున్న అనేకమంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తామని చెప్పిన రూ. 500 ఖాతాల్లో రావడం లేదని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సగం మందికే డబ్బులు జమ చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికే 3 విడతల రైతుబంధు ఎగ్గొట్టి నెలకు ఒక ఎకరానికి వేస్తూ టైం పాస్ చేస్తుందని మజర్ అన్నారు. ప్రజా పాలన అంటే కట్టిన ఇళ్లను కూల్చడం కాదని అన్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న నేటికి ఎమ్మెల్యేలకు సీడీపీ నిధులు కేటాయించక పోవడం ప్రభుత్వ చిత్త శుద్ధికి అద్దం పడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి దత్తత జిల్లాగా పేరున్న ఆదిలాబాద్ కు పేరు తప్ప పని ఏమి జరగలేదని అన్నారు. అసెంబ్లీలో మూడు బడ్జెట్ సమావేశాలు పూర్తయిన కూడా దత్తత ఆదిలాబాద్ జిల్లాకు మూడు పైసలు కూడా కేటాయించని ముఖ్యమంత్రితో ఆదిలాబాద్ జిల్లాకు న్యాయం జరుగుతుందని నమ్మకం లేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలుచేసి ఉంటే ప్రజా పాలన అయ్యేదని ఇప్పుడు ఈ పాలన పనికి మాలిన పాలన అని అన్నారు. జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దత్తత జిల్లా ఆదిలాబాద్ కు ప్రత్యేక నిధులు మరియు ఇంజినీర్ కళాశాల, ఏయిర్పోర్టు, సీసీఐ పునప్రారంభానికి అనుమతులతోనే రావాలని డిమాండ్ చేశారు. కొడంగల్ డిక్లరేషన్ పేరిట రూ. 10,000 కోట్లు కొడంగల్ కు కేటాయించిన రేవంత్ రెడ్డి, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు రూ. 5,000 కోట్లు మంజూరు పత్రంతోనే ఆదిలాబాద్ జిల్లాకు రావాలని డిమాండ్ చేశారు.

## పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

- **ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు**
- **రాజకీయ పక్షాలు బిఎల్ఎలను నియమించాలి**
- **కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. జూన్ 25 నుంచి ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారం లు ఇస్తారన్నారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫారం లు జూలై 24 వరకు తిరిగి తీసుకుంటారని వివరించారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చన్నారు. ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. అక్టోబర్ 1న తుది ఎలక్టోరల్ రోల్ జాబితా ప్రదర్శిస్తామని వివరించారు. ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని తెలిపారు. నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఖానాపూర్ ఈఆర్ఓ గంగాధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజా ప్రణాళికలో యువజన వారోత్సవాలు




**మహాదేవపూర్, ముద్ర :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా ప్రణాళిక లో భాగంగా ఈరోజు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో గన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది . జిల్లా యువజన మరియు క్రీడల అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో మరియు జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ఘనపూర్ కూడలి నుండి సెంటర్ కోటగుళ్ల గుడి వరకు హెరిటేజ్ వాక్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గన్పూర్ ఉప సర్పంచ్ కృష్ణ గారు, ఆర్కియాలజి డైరెక్టర్ బుజ్జీ, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ సిబ్బంది ఎం శివసాగర్ మరియు యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పెట్రోల్ ధరల పెంపుపై కాంగ్రెస్ వినూత్న నిరసన

- **సైకిల్ రిక్షాపై బైక్.. ఎడ్లబండిపై ర్యాలీతో కరీంనగర్‌లో ఆందోళన**

**ముద్ర, కరీంనగర్ :**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు సైకిల్ రిక్షాపై టూవీలర్‌ను పెట్టి లాగుతూ, ఎడ్లబండ్లపై ఊరేగింపుగా వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. పెరిగిన ఇంధన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాహనాలు నడపలేని పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. "క్రూడ్ ఆయిల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గుతున్నా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడం లేదు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను మళ్లీ ఎడ్లబండ్ల యుగంలోకి తీసుకెళ్తోంది. బైక్ నడపలేక రిక్షాపై మోసే పరిస్థితి తీసుకొచ్చింది" అని విమర్శించారు. ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు వినతిపత్రం అందజేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుధా చైర్మన్ కోటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మున్నూరు కాపు చైర్మన్ బొమ్మ శ్రీరామ్, కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, బీసీ సెల్, మైనార్టీ సెల్, ఎస్టీ సెల్, కిసాన్ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉద్యానవన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- **సీఎం రేవంత్ రెడ్డికి జగిత్యాల పట్ల వివక్షతన..? నిర్లక్ష్యమా..?**
- **మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**



జగిత్యాల రూరల్ మండలం చెలిగల్ వాలంతారిలో ఉద్యానవన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీమంత్రి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్ ఆలోచనకు అనుగుణంగా కెసిఆర్ విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలకు రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు 296 రెసిడెన్షియల్ స్కూల్స్ ఉంటే, తెలంగాణ ఏర్పాటు తర్వాత 613 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారన్నారు. గత రెండున్నరేళ్ల కాలం గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్స్ కు శాశ్వత భవనాలు ఏర్పాటుచేయాలని ఆలోచన కూడా చేయలేదన్నారు. మాజీ సీఎం కెసిఆర్ నూతన్ జిల్లాలు ఏర్పాటుచేసి ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, అనుబంధంగా ఆస్పత్రులు మంజూరు చేశారని, హైదరాబాద్ కు నలువైపుల నాలుగు టీమ్ ఆస్పత్రులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ స్కూల్స్ లో వసతులు కల్పించకుండా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ తెర పైకి తీసుకు వచ్చారన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి ఏవిధమైన చర్యలు చేపట్టలేదని, శాశ్వత భవనాలు నిర్మించకపోవడంపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. నిరుద్యోగులు నూతన ఉద్యోగాలు కల్పిస్తారని భావిస్తుంటే వెల్లడించడం లేదన్నారు.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ విధివిధానాలు ఏమిటి, బోధన నియామకాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధివిధానాలు ప్రకటించాలని, నియామకాలు ప్రక్రియ వెల్లడించాలన్నారు. చల్గల్ లో కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు అవసరమైతే 2 ఎకరాలు మాత్రమే కేటాయించారన్నారని అన్నారు. అలాగే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు కనీసం 20 ఎకరాలు అవసరం కాగా, 10 ఎకరాలు కేటాయించారన్నారు. ప్రభుత్వమే ఎమ్మెల్యే కనుసన్నల్లో నడుస్తుందన్నారు, 10 ఎకరాలు కేటాయించడం ఏమిటి, రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేయాలని ఉందా? లేదా? అని మండి పడ్డారు. ఎమ్మెల్యేకు పాలాభిషేకాలు చేయడం ఎందుకు..20 ఎకరాలు అవసరం అయితే 10 ఎకరాలకు కుదించబడినందుకా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డికి జగిత్యాల పట్ల వివక్షతన..? నిర్లక్ష్యమా..? అని ప్రశ్నించారు. నా మీద కోపం ఉన్న పర్వాలేదు.. ప్రజలు హక్కుగా భావించే హక్కుల పట్ల నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. జిల్లా మంత్రి లక్ష్మణ్ కుమార్ బాధ్యత తీసుకొని యంగ్ ఇండియా స్కూల్ కు 20 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు కేటాయింపజేయాలని, జగిత్యాలలో ఉద్యానవన యూనివర్సిటీ అవసరం ఉన్నదని, చల్గల్ లో ఉద్యాన వన యూనివర్సిటీ మంజూరుచేయాలని బీఆర్ఎస్ పక్షాన, రైతుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ ఛైర్పర్సన్ దావా వసంత, లోక బాపురెడ్డి, ప్రియాంక ప్రవీణ్, మున్నా, వెంకటేశ్వర రావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

- **జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ : కలెక్టర్ సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. జగిత్యాల కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని అన్నారు. జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. జులై 31 నుంచి ఆగస్టు 30వరకు అభ్యంతరాలను స్వీకరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. ఇంటింటి సర్వేలో ఓటర్ల వివరాల ధ్రువీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపు ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. కచ్చితమైన ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

## జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- **ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**



జగిత్యాల అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 42వ వార్డులో రూ.48 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను పరిశీలించి, నాణ్యతతో పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే రూ. 62 కోట్ల తో జగిత్యాల లో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, పార్కు సంధి దుకాణ దారులు చెత్తను ఇష్టారీతిన పడేయవద్దని, మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. నూతన బిటి రోడ్డు పక్కన వర్షం నీరు పోయే విదంగా ధోనీ మాదిరిగా ఏర్పాటు చేయాలి.అప్పుడే బీటీ రోడ్డు చెడిపోకుండా ఉంటుందన్నారు. జగిత్యాల పట్టణంలో ట్రేడ్ అనుమతులు ఇచ్చి రెవెన్యూ పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణంలో నాణ్యతతో పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్ నాగరాజు, బొలుసాని శ్రీనివాస్, డీఈ ఆనంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, దాసరి ప్రవీణ్, పోతునుక మహేష్, రాజు, కప్పల శ్రీకాంత్, ఈశ్వర్, ఏఈ అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు .



**-రాయికల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**

రాయికల్ పట్టణంలో అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా రూ.15.20 కోట్లతో చేపట్టే మంచి నీటి సరఫరా పనులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.14 కోట్లతో రాయికల్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు, మాజీ వైస్ చైర్మన్ రమాదేవి అచ్యుతరావు, కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, మచ్చ లక్ష్మి (శేఖర్), రాకేష్ నాయక్, లతికఅనిల్, శ్రీధర్, చిన్న ధర్మపురి, మానస భూమేష్, నాగరాజు,నాయకులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- **కిలో గంజాయి స్వాధీనం**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్ :**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రామరెడ్డిపల్లి బస్ స్టాప్ సమీపంలో గంజాయి అమ్ముతున్న బీహార్ కు చెందిన మనీష్ పాస్వాన్ ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడు బీహార్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకువచ్చి ఖానాపూర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో నిందితుడి వద్ద రూ.1లక్ష విలువైన కిలో గంజాయి, ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యాపారం, సరఫరా,గంజాయి సాగుపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్, పోలీస్ సిబ్బందిని



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.05.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వేసవిలో మాంసాహారం : తాజా మాంసాన్నే వాడండి**

ఎండాకాలంలో బ్యాక్టీరియా త్వరగా వృద్ధి చెందుతుంది కాబట్టి నిల్వ ఉంచిన, ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాన్ని తినకపోవడమే ఉత్తమం. ఎప్పటికప్పుడు తాజా మాంసాన్ని తెచ్చుకుని, బాగా ఉడికించి మాత్రమే తినాలి.



## అసంపూర్తి భవనాలతో ర్యాంకులు ఎలా సాధిస్తారు?

- రెండేళ్లుగా సిద్దిపేటలో అర్ధాంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనులు
- బీసీ స్టడీ సర్కిల్ పనులు చివరి దశలో ఉన్నా.. రెండేళ్లుగా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణ పనులను సందర్శించిన బీఆర్ఎస్ నేతలు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు గత ప్రభుత్వంలో మాజీ మంత్రి హరీష్ రావు స్థలం, నిధులు కేటాయించారని, భవన నిర్మాణ పనులు 75 శాతం వరకు పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం విమర్శించారు. అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి, స్టడీ సర్కిల్‌ను నిరుద్యోగులకు అందుబాటులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన భవనాలకు ప్రభుత్వ నిధులతో గానీ, సొంత నిధులతో గానీ కనీసం సున్నం కూడా వేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని ఆరోపించారు. ఇలాగే ఉంటే అభ్యర్థులు ర్యాంకులు ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. "సిద్దిపేట పౌరుడిగా, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసురుతున్నా. కాంగ్రెస్ ప్రభుత్వ నిధులతోనైనా, మీ స్వంత నిధులతోనైనా హరీష్ రావు నిర్మించిన భవనాలకు సున్నం వేయగలిగితే మీరు గొప్పవాళ్లని భావిస్తాం" అని పాల సాయిరాం అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌ను సీనియర్ నాయకులు ప్రభాకర్ వర్మ, శ్రీహరి యాదవ్, ఇతర సీనియర్ నాయకులు, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యువజన విభాగం సభ్యులు, నిరుద్యోగ యువతతో కలిసి సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి హరీష్ రావు ప్రత్యేక చొరవ తీసుకుని బీసీ స్టడీ సర్కిల్‌కు నూతన భవనం మంజూరు చేయించి, నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని పట్టించుకోకపోవడం వల్ల స్టడీ సర్కిల్‌లో చదువుకునే విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న స్టడీ సర్కిల్ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

## పాలకుల నిర్లక్ష్యంతో వెనకబడిన అభివృద్ధి

- టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బట్టి అజయ్




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నేటి వరకు కూడా మెదక్ అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగలేదని తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన (టిఆర్ఎస్) మెదక్ నియోజకవర్గ నాయకులు బట్టి అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మెదక్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాను మూడు భాగాలుగా విభజించి, ఆర్థికంగా బలమైన నియోజకవర్గాలను జిల్లాలుగా అభివృద్ధి చేస్తూ, మెదక్, నర్సాపూర్ వంటి గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను మాత్రం నిర్లక్ష్యం చేయడం జరిగిందన్నారు. మెదక్ అభివృద్ధి చెందాలంటే ఇండస్ట్రియలైజేషన్ రావాలి, అర్బనైజేషన్ పెరగాలి, ప్రైవేట్ ఇన్వెస్ట్మెంట్స్ రావాలి. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇచ్చి, అదే శిక్షణను స్థానిక పరిశ్రమలతో అనుసంధానం చేస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. మన రైతు బలపడితేనే మెదక్ బలపడుతుంది. రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగితేనే మన ప్రాంతం నిజమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. ఆ లక్ష్యంతో రైతులకు అండగా నిలబడి, వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బట్టి స్వాతి, చంద్రశేఖర్, రమేష్ గౌడ్, కేవల్ నంద కిషోర్, గణేష్, జూనేయిద్ పాల్గొన్నారు.

## కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**ముద్ర న్యూస్ :**

ఉపాధి హామీ పథకంలో కూలి పనులు చేస్తూ ఎండ దెబ్బకు ఓ వ్యక్తి మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి బుధవారం ఆర్థిక సాయం అందింది. నిజామాబాద్ జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలోని జప్తి జనకంపల్లి గ్రామంలో 2024 సంవత్సరంలో భూమని రాములు అనే వ్యక్తి ఉపాధి హామీ పనులు చేస్తూ వడదెబ్బకు మృతి చెందారు. బుధవారం అతని భార్య భూమని సాయవ్వకు రూ.2 లక్షల చెక్కును గ్రామ సర్పంచ్ వర్షిని అందజేశారు. ఆమె వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఉపాధి హామీ పథకం సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## మెదక్ చరిత్రను చాటిన హెరిటేజ్ వాక్

- కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం





**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా చారిత్రక ఆనవాళ్లు, పర్యాటక ప్రాంతాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. భావితరాలకు మెదక్ చారిత్రక, పర్యాటక విశిష్టత గురించి తెలియజేసేలా డాక్యుమెంటరీ రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల సందర్భంగా హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మత్స్యశాఖ అధికారి మల్లేశం, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డీపీఓ యాదయ్య, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, యువకులు, క్రీడాకారులు, మున్సిపల్ సిబ్బంది హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెస్లీ గోల్బంగ్లా, మెదక్ చర్చి, అనంతరం మెదక్ ఖిల్లా, బారాకమాన్ ప్రాంతాలను సందర్శించి వాటి చారిత్రక ప్రాధాన్యాన్ని తెలుసుకున్నారు. మెదక్ ఖిల్లా చారిత్రక పర్యాటక కేంద్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 22న హెరిటేజ్ ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా మరమ్మత్తులు, శానిటేషన్ డ్రైవ్, లైటింగ్ ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. యువత, పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

## పాఠశాలల ప్రారంభం రోజే విద్యా కిట్లు అందించాలి

- పిఆర్సీని వెంటనే ప్రకటించాలి
- టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి డిమాండ్




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

పాఠశాల ప్రారంభమయ్యేలోపే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫాంలు అందించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ మెదక్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యా రంగంలో ఉన్నటువంటి సమస్యలపైన చర్చించారు. యాదగిరి మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో జిల్లాల్లో మౌలిక సదుపాయాల లేమి ఉందని, వాటిని పాఠశాల ప్రారంభం లోపల పూర్తి చేయాలన్నారు. జనాభా గణన నేపథ్యంలో బడిబాట కార్యక్రమం, విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని జూన్ 2 నుంచి మొదలు పెట్టాలని కోరారు. గత నాలుగు ఐదు నెలల నుండి రామాయంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ప్రధానోపాధ్యాయురాలు నాగమణి తన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేస్తూ పాఠశాలలో విద్యాభ్యాసన ప్రక్రియకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. ఈ విషయంపై గతంలో రెండు సార్లు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారికీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం జెఎసికి ఇచ్చిన హామీ మేరకు పిఆర్సి రిపోర్ట్ ను తెప్పించుకుని మంజూరి చేయాలని, పెండింగ్లో ఉన్న కరువు బత్యాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన హెల్త్ కార్డులు మంజూరు అయ్యే వరకు పాత హెల్త్ కార్డులు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ సంగయ్య, హీరా లాల్, నజీరోద్దీన్, అల్వాల రమేష్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, దేవి సింగ్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ముద్ర న్యూస్ :**

ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నస్రుల్లాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నకిలీ ఓటర్లను తొలగించి, కొత్త ఓటర్లను నమోదు చేయాలని అన్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం

- కాంటాల జాప్యంతో రైతుల ఆగ్రహం.. ధాన్యం కుప్పలకు నిప్పంటించి నిరసన

**ముద్ర న్యూస్ :**

కామారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. రామారెడ్డి మండలం ఇసన్నపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సోమవారం రైతులు నిరసన చేపట్టి, వరి ధాన్యం కుప్పకు నిప్పంటించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అనేక కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేయడంలో ఆలస్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంటాలు వేసిన తర్వాత కూడా వారం రోజుల పాటు ధాన్యం సంచుల వద్ద రైతులు కాపలా కాయాల్సి వస్తోందని కర్షకులు వాపోతున్నారు. సమయానికి లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం తరలింపు నిలిచిపోతోందని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులపై పలుచోట్ల రైతులు ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా కామారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పెద్దగా ఇబ్బందులు



లేకుండా సాగాయి. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడంతో సమస్యలు తలెత్తలేదు. అయితే ప్రస్తుత రబీ సీజన్‌లో మాత్రం సమన్వయ లోపంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ 1 నుంచే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ సకాలంలో ధాన్యం కొనుగోలు జరగడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు 3.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీకాంత్ తెలిపారు. మరో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమస్యలను అధిగమించి కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

**జాప్యానికి ప్రధాన కారణాలివే..**

**హమాలీల కొరత:**

కొనుగోలు కేంద్రాలకు అవసరమైన హమాలీలను ముందుగానే అందుబాటులో ఉంచకపోవడంతో ధాన్యం నిల్వలు పెరిగిపోయాయి. కేంద్రాలకు ధాన్యం వచ్చిన 1012 రోజుల తర్వాతే హమాలీలను రప్పించడంతో ఒత్తిడి అధికమైంది.

**కొత్త సాంకేతిక విధానం:**

మొదట పాత విధానంలో కొనుగోళ్లు నిర్వహించి, అనంతరం ట్యాబ్ ఆధారిత కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో రెండు మూడు రోజుల పాటు కొనుగోళ్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే ధాన్యం విక్రయించిన రైతులను మళ్లీ కేంద్రాలకు పిలిపించి నమోదు చేయాల్సి రావడంతో గందరగోళం నెలకొంది.

**డిఫాల్ట్ మిల్లుల సమస్య:**

జిల్లాలో 40కిపైగా రైస్‌మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉండటంతో ధాన్యం తరలింపులో సమస్యలు తలెత్తుతున్నాయి. అందుబాటులో ఉన్న మిల్లులపై అధిక భారం పడుతుండగా, కొందరు మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా ధాన్యం అన్‌లోడ్‌లో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

**ముద్ర న్యూస్ :**

రైతులు జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా బీర్కూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు, ఏఈవో మీనా, విండో కార్యదర్శి విఠల్ అన్నారు. బీర్కూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గిడ్డంగిలో బుధవారం రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఏఈవో మాట్లాడారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తున్న 30 కిలోల బస్తాకు రైతు రూ.2452.50 ధర చెల్లించాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను తీసుకు వచ్చి విత్తనాలను తీసుకెళ్లాలని రైతులకు పిలుపునిచ్చారు. ఉప సర్పంచి పరమేష్ పంతులు, విట్టల్ సాయిలు, బాలకృష్ణ, శంకర్ లాలయ్య ఉన్నారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయం

**ముద్ర న్యూస్ :**

ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవడం అభినందనీయమని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ద్రోణవల్లి సతీష్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ బీర్కూరు మండల అధ్యక్షుడు సీతాలే రమేష్ వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు ఆయనను బుధవారం సతీష్ సత్కరించారు. అనంతరం సతీష్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య ఖర్చులకు నిమిత్తం రమేశ్ తన స్నేహితుల ద్వారా విరాళాలు సేకరించి ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాలకు అందజేయడం అభినందనీయమని సతీష్ అన్నారు. దీంతోపాటు నిరుపేదలు ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సాయం, గోశాలకు పశుగ్రాసం వితరణ చేసి సేవాభావాన్ని అలవర్చుకోవడం గొప్ప విషయం అని చెప్పారు.

## మొక్కజొన్న కొనుగోలు తూకంలో భారీ మోసం

**ముద్ర న్యూస్ :**

బాన్సువాడ మండలంలోని హనుమాజీపేట గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు తూకంలో భారీ మోసాలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సంచికి 51.300 కేజీలు కాగా.. 53 కిలోల మొక్కజొన్నలను తూకం వేస్తున్నారని రైతులు సొసైటీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com